సామాజిక సమస్యలు ముందు నడుస్తుంటే, చట్టాలు వెనక అనుసరిస్తోంటాయి. అందుకే ఎప్పటి కప్పుడు కొత్త చట్టాలు చేసుకోవలసిన అవసరం రావడం. సమస్య గుర్రానికి చట్టం బండిని ముందు కడితే యేమవుతుంది?

"అమ్మాయి వయసెంత?"

"ఇరవై దాటింది."

"ఎంతవరకు చదివింది?"

"ఎంత చదువుకొంటే ఏంలెండి, ఆడపిల్లలకు ఇల్లు దిద్దుకోటం వస్తే చాలు."



# కాలం మారింది

ఓ భాగ్యలక్ష్మి

"ఆ మాటా నిజమే ననుకోండి అయినా ఈ కాలం మగపిల్లలకంటె ఆడపిల్లలే ఎక్కువ చదువుకొంటున్నారు. వాళ్ళ చదువులకు తగిన వరుణ్ణి తీసుకురావటం కూడా కష్టంగానే వుంది. ఇంతకూ అమ్మాయి ఏం చదివిందన్నారు."

"దానికి ముందు నుంచీ కూడా చదువంటే ఆసక్తిలేదు. ఏదో మా పోరుకొద్దీ."

"డిగ్రీవరకైనా చదివించి ఉంటారు. ఉద్యోగం కూడా చేస్తోందా?"

"లేదండీ. అమ్మాయి....."

"ప్రస్తుతం ఉద్యోగం లేకపోయినా పర్వాలేదులెండి. చేతిలో డిగ్రీ ఉంటే .."

"అది కాదండీ"

"ఏదో ఒక ట్రైనింగ్ లాంటిది పూర్తి చేస్తే ఏ టీచరు ఉద్యోగమో దొరుకుతుంది."

ఉన్నత ప్రమాణాంగల
పుస్తకాలు

350జపాన్ పరిశ్రమల గైడ్ రు.15/-; టైలరింగ్ అండ్ కటింగ్ ఫ్యాషన్ పుస్తకంతో 16/-; ఎలక్ట్రిక్ రేడియో అండ్ ట్రాన్సిస్టర్ గైడ్ (బొమ్మలతో)15/- డ్రాయింగ్ అండ్ పెయింటింగ్(400 బొమ్మలు)12/-కోక్ శాస్త్రం 12/- ప్రైవేటు ఫొటో ఆల్బం 25/-మెడికల్ సెక్స్ గైడ్ 10/-నూతన వివాహ జీవితం 100 ఫొటోలతో 12/- ఫొటోగ్రఫీ గైడ్ 10/- పోస్టేజి అదనం.

AMAN BOOK DEPOT (AJW-5),
Phaffala, ALIGARH-35 (U.P.)

SULEKHA

శ్వేతవర్ణపుమచ్చలు



శ్వేతకుష్ఠు నివారణకు మచ్చంపై కొద్దిగా మందు పూసినయెడల వాటిపై ఉన్న మలినం శీఘ్రంగా వదులుతుంది. ఆ మచ్చంయొక్క రంగు మారిపోయి అసలు చర్మంలో కలిసిపోతుంది. ఒక్కసారి వాడండి పరీక్షించండి.

SHYAM AYURVED BHAVAN
P.O. KATRI SARAI (GAYA)

వార్తలకు, వ్యాఖ్యలకు
"ఆంధ్ర జ్యోతి"
దిన పత్రికనే చదవండి.

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!



హస్తప్రయోగం,అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి,శుక్లనష్టము, నపుంసకత్వము,హెర్నియా, చర్మవ్యాధులు,పోస్టుద్వారా కూడావైద్యంచేయబడును. వరిబీజము(బుడ్డ),మూత్రవ్యాధులు ఆపరేషన్ లేకుండ.రండి.

డా॥దేవర, ఫోన్ 551,
మార్వాడి గుడివద్ద, తెనాలి.

బ్రాంచి : 26, నార్త్ బోగ్‌రోడ్,మద్రాసు-17

# నెమరు

మహా కవిగాడి మాట విని
వడదెబ్బకి తాళలేక
అరిచే కోయిల కేక
శృతి పేయ మనుకున్నాను
అతి చోద్యమనుకున్నాను
మా కవిగాడి మాట విని
మంచుపొగని తూకం వెయ్యొచ్చను
కున్నాను
అందాన్ని గటగటా చెరుకు రసంలా
తాగెయ్యొచ్చనుకున్నాను
విస్తట్లో పరవాన్నంలా
లాగెయ్యొచ్చనుకున్నాను
ఎండమావుల్లో మంచినీళ్ళు తాగినట్టేనని
ఆదట తెల్సుకున్నాను
కాని— లాభమేముంది
అప్పటికే నా యవ్వనబ్బాతు
జబ్బుపడింది.

—నర్సాపేట ఒత్సల

"అసలు మా అమ్మాయికి డిగ్రీ లేదండీ"

"అదేంమాట? ఈ కాలంలో డిగ్రీవరకైనా చదివించని వాళ్ళుంటారటండీ. అందులో మీలాంటి లోకజ్ఞానం ఉన్న వాళ్ళు!"

"లోకజ్ఞానానికేంలెండి. చదువు అబ్బి రావద్దూ."

"ఇంతకూ అమ్మాయి ఇంటర్మీడియేటు పాసయిందా లేక స్కూలు ఫైనలా?"

"లేదండి బాబూ తొమ్మిదో తరగతి చదువుతూ మానేసింది."

"ఏమిటీ, కనీసం స్కూలు ఫైనలు వరకైనా చదువుకోలేదూ?"


"చదువుకోకపోతే ఏమండీ, పిల్ల లక్షణంగా వుంది. తెలివి తేటలున్నాయి."

"తెలివితేటలు ఏం చేసుకొంటామండీ. ఈ రోజుల్లో చదువులు కావాలి చదువులు. ఏ స్కూలు ఫైనలులో అయితే యల్.డి.సి.గానో, టైపిస్టుగానో ఛాన్సులుండేవి. మరీ తొమ్మిదోతరగతి అంటే...." అవతలాయన చప్పరించేశాడు. పరశురామయ్యగారికి కొంచెం కోపం వచ్చింది. "మరీ ఇంతగా కాలం పాడవుతుందనుకో లేదండీ బాబూ. ఇంటికోడలు లక్ష్మిలా ఉండాలని, ఇల్లు చక్కబెట్టుకొని పిల్లా, పాపలతో చల్లగా ఉండాలనే కాలం పోయింది. ఆడపిల్ల ఉద్యోగం చేస్తేగాని ఇల్లు గడవని రోజులొచ్చాయి."

"ఇన్ని మాటలెందుకులెండి. మగపెళ్ళివారి అభిమతం, ముఖ్యంగా అబ్బాయి అభిప్రాయం నాకు తెలుసుగనుక ఈ వివరాలన్నీ అడిగాను మీకు తగిన సంబంధం మీకు దొరక్కపోదు. వారికి తగిన సంబంధం వారికి దొరక్క పోదు."

ఈవిధంగా సంబంధాలు దొరక్కపోవటం పరశురామయ్యగారికి కొత్తకాదు. నాలుగయిదేండ్లుగా పడుతున్న పాట్లే. అంతకు ముందు ఎనిమిదేండ్ల కాలంలో తన బాధలేవో తను పడి ముగ్గురు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళుచేశాడు.ఇంతో. అంతో కట్నం ముట్టజెప్పాడు. ఆ ఋణాల బాపతు ఇంకా మిగిలేవుంది. ఇద్దరు కొడుకుల చదువులు సాగుతున్నాయి

పెద్దవాడు యం.యస్‌సి చదువుతున్నాడు. రెండో వాడు మెడిసిన్ రెండో సంవత్సరం. రాధ మాత్రం పెళ్ళి కాకుండా మిగిలిపోయింది. ఏళ్ళు పైబడుతున్నాయి. నాలుగేండ్లుగా పెళ్ళి ప్రయత్నాలు జరుపుతూనే ఉన్నాడు. వరులు అడిగే కట్నాలకు తూగలేక, తక్కువ బేరాలు కుదరక అమ్మాయి పెళ్ళి వెనకబడి పోతూ వచ్చింది. ఇప్పుడు కొత్తగా వచ్చిన వరకట్న నిషేధం పుణ్యమా అని పిల్ల పెళ్ళి తేలిగ్గా కుదురుతుందను కొంటే, అందరూ చదువా, ఉద్యోగమా అనిఅడుగుతున్నారు. ఆడపిల్లల చదువు విషయంలో తనెప్పుడూ



శ్రద్ధ తీసుకోలేదు. ముగ్గురు ఆడపిల్లలూ అత్తగారిండ్లకు వెళ్ళిపోయేసరికి తనకు ఇంటి పనులలో సాయంగా ఉంటుందని వాళ్ళమ్మ చదువు మానిపించేసింది. కాలం కూడా ఎంత త్వరగా పరుగెడుతోంది! మొన్నటి పిల్ల రాధకు అప్పుడే ఇరవై మూడు ఏండ్లు నిండాయి.

పరశురామయ్యగారు ఉస్సురనుకుంటూ ఇంటికి రాగానే వరలక్ష్మమ్మ అడిగింది. "ఏమన్నారు? సంబంధం అందివచ్చేట్టుందా?"

"ఎలా అందివస్తుంది? మన అమ్మాయేం ఉద్యోగం చేస్తోందా? ఊళ్లేలుతోందా!" విసుగ్గా అన్నాడు పరశురామయ్య.

"అదేంటండీ అలా అంటారు. మన అమ్మాయిలకు పెద్ద చదువులొద్దని మనమేగా అనుకొన్నాం.

"మనమేగా అనుకొన్నాం" ఆమెను వెక్కిరిస్తున్నట్లుగా అన్నారు. "లేకపోతే నీ కూతుళ్ళు పెద్దగా బియ్యేలు, ఎమ్మేలు వెలగబెట్టినట్లు."

"ఏమో వాళ్ళ తలరాతలో చదువు లేదేమో! పెద్దపిల్లలు ఇద్దరూ తెలివైనవాళ్ళే. అయినా వాళ్ళను ఎనిమిదో తరగతితోనే ఆపించేశారుగా".

"వాళ్ళకేం తక్కువయిందిప్పుడు! చక్కగా పిల్లా, పాపలతో ఉన్నారు. నీ ముద్దుల కూతురు రాధ పెళ్ళి విషయం వచ్చేసరికి పెళ్ళికొడుకులకు చదువులూ, ఉద్యోగాలూ కావలసివచ్చాయి"

"నిజంగా అలా అడిగారా అండీ."

"ఊఁ దీనికంటే వేలకువేలు కట్నాలు పోసి పెళ్ళి చెయ్యటమే మేలనిపిస్తోంది. చదువురానివాళ్ళకు ఇంక పెళ్ళిళ్ళే కావా ఏమిటి కర్మ."

రాధకూడా అమ్మా-నాన్నలు పడుతున్న ఘర్షణ వింటూనే ఉంది. స్కూలు పాఠాలంటే అర్థం చేసుకోలేకపోయిందిగాని, లోక వ్యవహారాలు బాగానే తెలుస్తాయి ఈ అమ్మాయికి.

నాలుగేళ్ళ క్రితం వాళ్ళ రమక్క పెళ్ళయినప్పటినుంచి తన పెళ్ళి విషయమై తల్లిదండ్రులు చాలా తొందరపడటం చూస్తూనే వుంది. ఆ రోజుల్లో కట్నాలు ఆకాశాన్ని అంటుతున్నప్పుడు కమక్క పెళ్ళికి చేసిన అప్పులే తీర్చలేక తీర్చలేక సతమతమవుతున్నప్పుడు. పెళ్ళికొడుకుల ధరలు వినగానే తండ్రి ఉస్సురనుకొని మరో సంబంధం కోసం వెతికేవారు వాళ్ళు మరో రెండువేలు ఎక్కువే అడిగేవారు. ఇంతలో కట్నాలు రద్దుచేస్తూ


## అరబ్ దేశాలలో ఉద్యోగం

నిశ్చితమైన పద్ధతి, ప్రభుత్వ నిబంధనలు మరియు ఖాళీలు తెలుసుకునే విధానం మీకు తెలిసినట్లయితే గల్ఫ్ దేశాలలో నేరుగా ఉద్యోగంను మీరు పొందవచ్చు. స్త్రీలు / పురుషులకు స్కిల్డ్, సెమి స్కిల్డ్ మరియు అన్‌స్కిల్డ్ పనివార్లగా నెలకు మూడునుంచి పన్నెండు వేల రూపాయలవరకు జీతంపై ఉద్యోగావకాశాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇటీవల చాలామంది నేరుగా ఉద్యోగాలు పొందారు. పూర్తి సమాచారం మరియు 800 విదేశీసంస్థల యొక్క చిరునామాలు మరియు 100 మంది రిక్రూటింగ్ ఏజెంట్ల చిరునామాలు గల గైడు కొరకు ఇంగ్లీషు/హిందీలో మాత్రమే స్వంత చిరునామాగల కవరుతో మాకు వ్రాయండి.

GLOBE SERVICE INFORMATION CENTRE (REGD) (411/10)
WZ. H/24, New Mahabir Nagar, NEW DELHI-110 018.



## ఋణం

వ్యాపారాభివృద్ధికోసం ఆకర్షణీయమైన షరతులమీద భవనం, వ్యాపారం షాపులు, భూములు, థియేటర్లు, లిమిటెడ్ కంపెనీలు, పరిశ్రమలు వగైరాలపై రు. 20,000 లేక ఆ పైన ఋణం లభించును.
వ్రాయండి లేదా సంప్రదించండి. ఫోను : 395126

SUPREME CORPORATION (BANKERS)
F-15 "EVEREST" 7th Floor, Near Famous cine laboratory,
Tardeo Road, BOMBAY-400 034


ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో



## శుభవార్త

డాక్టర్లకు సాధ్యముకాక వదిలివేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. లావుపాటివారు సన్నగను బలహీనులను బలవంతులుగను చేయబడుదురు. మధుమేహము, రక్తపుపోటు, కుష్టు, బొల్లి, క్యాన్సరు, సంతానం లేనివారుకూడా శ్రీ యోగిగారి కాయకల్ప చికిత్సవలన సంపూర్ణ ఫలితము పొందగలరు. ఈ చికిత్సవలన దేహములోని అన్ని వ్యాధులు తొలగిపోవుటయేగాక నూతన యవ్వనము కలుగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రు. 4-00లు యం. ఓ. పంపవలయును.

మేనేజర్,
శ్రీ యోగాశ్రమ్,
పెదవాల్తేరు P. O., విశాఖపట్టణము-17.




కష్టం ఒకటి వచ్చింది. ఈ మార్పు గురించి నాన్నగారు సంతోషించినంత సేపు లేదు. ఇంతలో కొత్త బెడద వచ్చి పడింది చదువులూ, ఉద్యోగాలూ అంటూ.

"రాధా- ఏం చేస్తున్నావు?" ప్రక్కింటి సుమతి పిలుపుకు రాధ తన ఆలోచనలు కట్టిపెట్టి ఇవతలికి వచ్చింది.

"పనేమయినా ఉందా. ఖాళీగా ఉన్నావా?"

"పనేంలేదు. ఏం?"

"ఉమ వాళ్ళింటికి వెళ్దాం వస్తావా?"

"ఉమా! మీ స్కూల్లోనే పని చేస్తోంది కదూ!"

"అవును తనని మా ఇంట్లోనే ఒకటి రెండుసార్లు చూశావుగా."

"అవునవును."

"తనకు పెళ్ళి కుదిరింది. తిరుపతిలో పెళ్ళట. రేపో ఎల్లుండో బయలుదేరుతారు. నేను వెళ్ళడం కుదరదుగనుక ఇప్పుడే వెళ్ళి పలకరించి వద్దామనుకొంటున్నాను."

"ఇదిగో ఐదు నిమిషాల్లో వచ్చేస్తాను కాస్త మొహంకడుక్కొని."

"సరే. సరే ఇంతలో నేనూ చీర మార్చుకొంటాను."

సుమతి వెళ్ళగానే రాధ మొహం కడుక్కొని అద్దం ముందు నిలుచుంది తల దువ్వుకోటానికి. ఉమకు కూడా పెళ్ళి కుదిరిందంటే తనకెందుకో ఈర్ష్యగా ఉంది. ఉమ ఏమంత అందగత్తె అని? వయసెంతుంటుందో. తనకంటె ఏడెనిమిదేళ్ళయినా పెద్దదే అయినా ఉద్యోగం చేస్తోందిగా. అందుకే పెళ్ళి ఇట్టే కుదిరింది. ఈ కాలం అందరికీ సంపాదించే భార్యలే కావాలి మరి... రాధ నిట్టూర్చింది.

* * *

మొత్తానికి ప్రాక్టీసు అంతగాలేని ఒక లాయరు రాధను భార్యగా స్వీకరించాడు. రాధ హృదయం ఉప్పొంగింది. మనోవాక్కాయ కర్మలా అతని ఇల్లు స్వర్గంగా మార్చాలని ప్రయత్నించింది. అయినా ఇంట్లో డబ్బుకు కటకటగా ఉంటే ఎంత చాతుర్యం ఉంటేమాత్రం సౌకర్యాలేమి అమరుతాయి?

ఒక రోజు "రాధా" అని ప్రేమగా పిలిచాడు మాధవరావు.

చిరునవ్వుతో వచ్చింది.

"మీ నాన్నగారు ఉత్తరం వ్రాశారు. పండక్కి రమ్మంటున్నారు. వెళ్దామా?"

"మీ ఇష్టం. మీకు వీలయి వెళ్దామనుకొంటే వెళ్దాం."

"నీ ఇష్టం మాటేమిటి?"

"ప్రత్యేకంగా నా ఇష్టమంటూ ఏముంది? అక్కలూ, బావలూ వస్తారు కాబట్టి మనం వెళ్ళకపోతే అమ్మ మనసు కష్టపెట్టుకొంటుంది."

"మనమూ వెళ్దాం. నలుగురితో సరదాగా ఉంటుంది. సరేగాని నేనో విషయం చెబుతాను. సరిగా అర్థం చేసుకొంటావా?"

"చెప్పండి. ఈ మట్టిబుర్రకు ఎంత అర్థమయితే అంత అర్థం చేసుకొంటాను."

"నీదేం మట్టిబుర్ర కాదు రాధా. నీది మట్టిబుర్ర అనుకొనే వాళ్ళది మట్టిబుర్ర."

కొద్దిగా సిగ్గుపడింది రాధ. "సర్లెండి. అసలు విషయం చెప్పండి."

"మీ నాన్నగారు నీకు పెళ్ళిలో ఏం పెట్టారు?"

తెల్లబోయింది పెళ్ళయిన ఆరు నెలలకు మీరీ ప్రశ్న అడుగుతోంటే ఆశ్చర్యంగా ఉంది."

"పోనీలే, ఇప్పుడయినా అడుగుతున్నానుగా."

"మీకు తెలీనిదేముంది? పదహారు సవరస్ల నగలు పెట్టారు. పట్టుచీరలు నాలుగు ఇచ్చారు. మీ కొక ఉంగరం చేయించారు. సూటు కుట్టించారు."

"మీ అక్కలకు?"

"వాళ్ళ పెళ్ళిళ్ళకు బాగానే ఖర్చయింది నాన్నగారికి. నగలు, లాంఛనాలు అటుంచి పది పన్నెండు వేలకు తక్కువ గాకుండా నగదు ఇచ్చుకొన్నారు."


"అంటే నీకంటె వాళ్ళకు ఎక్కువగా ముట్టిందిగా."

"అవును మరి. ఆ రోజులలో కట్నాలు లేకుండా పెళ్ళిళ్ళయ్యేవేమిటి?"

"అది సరేలే. కట్నాలు లేవుకదా అని ఆయన నీకెందుకు అన్యాయంచెయ్యాలి."

"అన్యాయమేముంది?"

"కాదా మరి. మీ నాన్నగారికి పదెకరాల పొలం వుంది. దానిలో నీ తమ్ముళ్ళిద్దరికీ



భాగం వుంటుంది. మీ అక్కలకే మో యింతో, అంతో నగదు ముట్టింది. నీకేం దొరికిందంట?"

"మీది చోద్యం గాకపోతే తండ్రిఆస్తి కొడుకులకుగాక కూతుళ్ళకెలా వస్తుంది?"

"ఆడపిల్లకు కూడా తండ్రి ఆస్తిలో హక్కువుంది రాధా. నీకీసంగతి తెలీక పోతే యిప్పుడు తెలుసుకో."

"తెలుసుకొంటే లాభమేముంది? నేను వెళ్ళి నాన్నగారిని అడగగలనా? ఆయన మనసొప్పి యిస్తారా?"

"అదంతా నీ యిష్టం. నీకున్న హక్కు గురించి చెబుతున్నాను. మీ అక్కల పెళ్ళిళ్ళకు చేసిన అప్పులు ఇప్పుడు ఇంచుమించు తీరిపోయాయి. అంటే మీ నాన్నగారు తమకున్న ఆస్తిని వదిలంగా పెట్టుకొనే ఆడపిల్లలకు ఇంతో, అంతో ఏర్పాటు చేశారు. కొడుకులకేమో పెద్ద చదువులతో పాటు ఆస్తీ ఇస్తున్నారు. నీకు ఇటు ఆస్తీ లేదు, అటు చదువూలేదు, ఔనా?"

రాధ ఏం మాట్లాడలేదు.

"స్త్రీలకు హక్కులు కావాలంటారు. అన్యాయాలు జరగకూడదంటారు. మీ హక్కులు మీరే కాపాడుకోకపోతే ఎలా? కట్నాలంటే మీ ఆస్తిలో వాటాకు బదులుగా ఏదో డబ్బు ఇచ్చారనుకోవచ్చు. ఇప్పుడేం మిగిలింది?"

"ఆస్తులున్న వారి సంగతి వేరు. ఇటు ఆస్తీ లేక అటు చదువూలేక వుండిపోయిన ఆడపిల్లల మాటేమిటి?" అని ఎదురు ప్రశ్న వేసింది రాధ.

"వాళ్ళు ఏ వ్యవసాయదారుణ్ణో, కార్మికుణ్ణో, శ్రామికుణ్ణో ఎన్నుకోవచ్చుగా. ఏ తండ్రిఅయినాతనస్తోమతకుతగినట్లు కొడుకుకుఏర్పాటు చేసినట్లుకూతురికీచెయ్యాలి. కట్నాల దురాచారం పోవాలంటూ మీ కాళ్ళపై మీరే గొడ్డలి వేసుకొన్నారు. మీకు రెండు విధాలా జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టలేకపోతున్నారు."

"అంటే సమస్యల రూపం మారింది గాని, సమస్యలు అలాగే వున్నాయన్న మాట."

"అంతే మరి."

"ఇంతకూ మనం పండక్కు వెళ్తున్నామా?"

"అవునను కొన్నాంగా."

"సరేగాని మీరు నాకు అండగా నిలబడ్డారంటే నాన్నగారిని ఆస్తివిషయం కదుపుతాను. నిష్ఠూరం వస్తే వచ్చింది నా హక్కు ఎందుకు వదులుకోవాలి?"

మాధవరావు చిరునవ్వుతో ఆమె నే చూడసాగాడు.

"నవ్వుతారెందుకు? నేనామాత్రం అడగలేననా?"

"అహ అందుక్కాదు. నీ ఆవేశం చూస్తుంటే నవ్వు వచ్చింది" అంటూ మాధవరావు అక్కడినుంచి వెళ్ళిపోయాడు తనలో తానే నవ్వుకొంటూ.

[వరకట్న నిషేధం చట్టరూపంలో వస్తే, దానిని కఠినంగా అమలుజరిపితే రాబోయే పరిణామాల గాథ.]

# వింత వార్తలు

## పిశాచాల కోరిక

ఈ పిశాచాలు చనిపోయినవారికి సంబంధించిన వికావు. మన మధ్యనే, మనకు కనిపిస్తూనే తిరుగుతున్న భయంకర నరరూప పిశాచాలివి. అటువంటి వాటిలో అయిదు పిశాచాలు కలిసి కొద్ది రోజుల క్రితం ఢిల్లీలో ఒక క్యాబరే నర్తకిపైన దాడి చేశాయట. తెల్లవారుఝామున ఆ నర్తకి ఒక టాక్సీలో హోటల్‌కు వెడుతుండగా



అయిదుగురు గూండాలు ఆమె కారులో పిశాచాలవలె జొరబడ్డారట. ఆ నర్తకి వద్ద వున్న సొమ్మును దోచుకోవడంతో వారు సరిపెట్టుకోలేదు. ఆమెను కారుదిగివెళ్ళి హెడ్ లైట్స్ వెలుగులో నగ్నంగా నాట్యం చేయమని ఆ గూండాలు ఆదేశించారట. ఇంతలో అటుగా వచ్చిన ఢిల్లీ పోలీసులు ఆ నరరూప పిశాచాలకు సంకెళ్ళువేసి తీసుకుపోయారట!

## భూలోక నరకం

భూలోక నరకం ఒకటి బీహార్ రాష్ట్రంలో వెలసినదట! అక్కడ యమధర్మరాజులు పదులు, వందల సంఖ్యలో వుండడం దాని ప్రత్యేకతట! పాట్నాలోని దాల్‌సింగ్‌సరాయ్ వద్ద ఈ భూలోక నరకం ఒక వేశ్యావాటిక రూపంలో నెలకొని వున్నదట. రాష్ట్రంలోని వివిధ



ప్రాంతాలలో ఆప్తులతో కలిసి హాయిగా జీవిస్తున్న అందాల యువతులను కొందరు అపహరించుకుపోయి నరక కూపంలాంటి ఈ వేశ్యావాటికలో నిర్బంధిస్తున్నారట. బెగుసరాయ్, సమస్తిపూర్ జిల్లాలకు చెందిన పేరుమోసిన హంతకులు, గజదొంగలు రహస్యంగా వచ్చి ఈ అమాయక యువతులను అనుభవించి వెడతారట! గజదొంగల మృగవాంఛలు తీర్చడానికి పెద్ద ముఠా ఒకటి పకడ్బందీగా అమ్మాయిలను అపహరిస్తున్నట్టు అధికారులు గుర్తించారట!

## కటకటాల్లో రికార్డు

గాంధీజీ పేరుతోపాటు ఆయనను చంపిన గాడ్సే పేరుకూడా శాశ్వతంగా నిలిచిపోయినట్టే. అత్యుత్తమ విషయాలతో పాటు అధమాధమ చర్య లెన్నిటికో చరిత్రలో చోటు దొరుకుతూంటుంది. అపోలో యాత్రికుల ఘన విజయాన్ని నమోదు చేసుకున్న చరిత్రే, అసాధారణమైన రీతిలో జరిగే హత్యలనుకూడా రికార్డు చేసుకోవడం కద్దు. ఇటీవల ఒక ఆస్ట్రేలియన్ ఖైదీ స్థాపించిన రికార్డు ఈ కోవకు చెందినదే. 27 సంవత్సరాల సుదీర్ఘ కారాగారవాసం అనంతరం ఆ ఖైదీని ఆస్ట్రేలియన్ ప్రభుత్వం విడుదల చేసింది. ఆస్ట్రేలియా మొత్తంమీద అంతకాలం ఏకబిగిన జెయిలు శిక్ష అనుభవించిన నేరస్థులు ఇంకెవ్వరూ లేరట! మెల్‌బోర్న్ జెయిలునుంచి విడుదలైన ఆ ఖైదీ ఒక పోలీసు కానిస్టేబుల్‌ను చంపిన నేరానికి 27 సంవత్సరాలు శిక్ష అనుభవించాడు!

— మాగంటి